క్లుప్తంగా

నేడు సమావేశం

పూడూరు: గ్రామాభివృద్ధిపై ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులతో బుధవారం సమీక్ష నిర్వహించనున్నామని ఎంపీడీఓ ఉమా దేవి తెలిపారు. బుధవారం ఉదయం 12 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం ఉంటుందని, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరుకావాలన్నారు.

రేవంత్ ఇంట్లో 'హాత్‌సే హాత్ జోడో' నేడు

కొడంగల్ రూరల్: టీపీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డి నివాసంలో బుధవారం ఉదయం 11గంటలకు 'హాత్‌సే హాత్ జోడో అభియాన్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రశాంత్ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ హాత్‌సే హాత్ జోడో సమావేశానికి పార్టీ మండల నాయకులు, వర్కింగ్ ప్రెసిడెంట్లు, గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీసెల్ నాయకులు, కౌన్సిలర్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు, రేవంత్‌రెడ్డి అభిమానులు అధిక సంఖ్యలో రావాలని కోరారు.

బాల్యమిత్రుల భరోసా

స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచిన మిత్రులు



రాంచందర్ కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న సర్పంచ్, మిత్రబృందం

యాలాల: అనారోగ్యంతో మృతి చెందిన బాల్య మిత్రుడి కుటుంబానికి తోటి స్నేహితులు అండగా నిలబడడమే కాకుండా.. భవిష్యత్తులోనూ ఆదుకుంటామని భరోసా ఇవ్వడం అభినందనీయమని సర్పంచు సిద్రాల సులోచన అన్నారు. మండల కేంద్రానికి చెందిన రాంచందర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మిత్రబృందం.. రాంచందర్ కుటుంబానికి అండగా నిలిచారు. రూ.21వేలను పోగు చేసి సర్పంచికి ఇవ్వగా.. ఆమె బాధిత కుటుంబానికి అందజేశారు. అనంతరం మిత్రులు ప్రభాకర్‌చారి, ప్రవీణ్‌కుమార్, రజాక్ మాట్లాడుతూ రాంచందర్ మృతి కలిచి వేసిందని, ప్రస్తుతానికి సాయం చేశామని చెప్పారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు



నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

నవాబుపేట: అధికారుల నిర్లక్ష్యం ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉన్న మరుగుదొడ్లు, మూత్రశాలలు నిరుపయోగంగా మారి ఏళ్లు గడుస్తున్నా.. సంస్థ అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదు. దీంతో ప్రయాణికులు అవస్థ పడుతున్నారు. అందుబాటులో మరుగుదొడ్లు ఉన్నా.. ఉపయోగకరంగా లేవని, చుట్టూ పిచ్చిమొక్కలతో పందుల దొడ్డిగా మారిందని వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి ఆ మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని కోరతున్నారు.

'మనఊరు'తో సర్కారు బడుల అభివృద్ధి

కుల్కచర్ల: మనఊరు–మనబడి కార్యక్రమంతో గ్రామీణ ప్రాంత పాఠశాలలు అభివృద్ధి చెందుతున్నాయని జెడ్పీటీసీ రాందాస్ నాయక్ అన్నారు. మంగళవారం చౌడాపూర్ మండల కేంద్రంలోని జెడ్పీపాఠశాలలో కొనసాగుతున్న మనఊరు–మనబడి అభివృద్ధి పనులను పరిశీలించి మాట్లాడారు. కార్పొరేట్ స్కూళ్లకు ఏ మాత్రం తీసిపోకుండా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. దీంతో పల్లె ప్రజలు తమ పిల్లలను సర్కారు బడులకు పంపేందుకు మొగ్గుచూపుతున్నారని తెలిపారు. ఎంపీటీసీ శంకర్, పాఠశాల చైర్మన్ యాదయ్య, ప్రధానోపాధ్యాయుడు తిమ్యా, స్థానిక నాయకులు శంకర్ పాల్గొన్నారు.

కష్టాల్లో పాడి రైతులు

- పెరుగుతున్న దాణా ధరలు
- భారంగా మారిన పశుపోషణ
- ఆందోళన చెందుతున్న కర్షకులు
- గిట్టుబాటు లేక ఎత్తివేస్తున్న డెయిరీలు



పశువుల పాకలో పాడి పశువులు

పరిగి: 'పాడి ఉన్న ఇంట సిరుల పంట' అని పెద్దలు అన్న మాట ఎలా ఉన్నా.. నేడు అది రైతుల ఇంట కష్టాలు తెచ్చిపెడుతోంది. పాడి రంగాన్ని ఎంచుకున్న కర్షకులకు నష్టాలు తప్పవన్నట్లుగా తయారైంది. పాడి రంగంలో రాణించాలంటే వారు.. అధిక పాలు ఇచ్చే పశువులకు రెండు పూటలా పోషకాహారం అందజేస్తే కానీ.. రాణించలేరు. దాణాను పుష్టిగా పట్టిస్తే.. పశువులు అధిక పాలు ఇవ్వడంతో పాటు ఆరోగ్యంగా ఉంటాయి. కాని పాడి రైతులు ప్రస్తుతం దాణాను పెట్టే పరిస్థితిలో లేరు. ఇందుకు కారణం దాణాల ధర పెరగడమే అని వాపోతున్నారు. జిల్లాలో 19 మండలాలు ఉండగా.. సుమారు 1లక్ష 95వేల ఆవులు, 1లక్ష 60వేల బర్రెలు ఉన్నాయి. నిత్యం 45వేల నుంచి 60 వేల లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నాయి.

దాణా ధరలకు రెక్కలు

పెరుగుతున్న దాణా ధరలతో పాడి రైతులకు మిగులుబాటు లేదు. డెయిరీలో ఎక్కువగా రైతులు పత్తి దాణా, గోదుమ పొట్టు, మొక్కజొన్న పిండి, పల్లీ చెక్క, కొబ్బరిపిండిలను వాడుతుంటారు. గతేడాది ఈదే సీజన్‌లో పత్తి దాణ కిలోకు రూ.38 ఉండగా నెల రోజుల్లో మరింత పెరగనుందని దుకాణదారులు, మిల్లుల యజమానులు పేర్కొంటున్నారు. అలాగే మొక్కజొన్న రూ.26, పల్లి రూ.45, కొబ్బెర రూ.50, గోదుమ రూ.25 మిగత దాణాల ధరలు పెరగడంతో రైతులు పశువులకు దాణాలు వేసేందుకు వెనకడుగు వేస్తున్నారు. నష్టాల పాలవుతుండటంతో ఈ రంగాన్ని వీడే ఆలోచనలో కర్షకులు ఉన్నారు.

పోషణ భారమై.. కబేళాకు

పశు పోషణ భారం కావడంతో కొందరు రైతులు వాటిని కబేళాలకు తరలిస్తున్నారు. వచ్చిన ధరకు విక్రయించి అడ్డా కూలీలుగా మారుతున్నారు. పాడి రంగాన్ని నమ్ముకుంటే కుటుంబ పోషణ కూడా భారమై.. అడ్డాకూలీలుగా మారాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. డెయిరీల పాల ధరలు మోస్తారుగా పెరుగుతున్నప్పటికీ.. దాణా ధరలు సమాంతరం కావడంతో గిట్టుబాటు కావడం లేదని రైతులు అంటున్నారు. అన్ని రంగాలను ఆదుకుంటున్న ప్రభుత్వం.. పాడి పరిశ్రమను ఎందుకు ఆదుకోవడం లేదంటూ ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా.. దాణ దాచిపెట్టి, కృత్రిమ కొరత సృష్టిస్తూ కొందరు ధరలు పెంచుతున్నారని, ప్రభుత్వం ఇలాంటి వాటిని నియంత్రించాలని కోరుతున్నారు.

ఆదుకోవాలి



అన్ని రంగాలను ఆదుకుంటున్న ప్రభుత్వం పాడి రైతులను కూడా ఆదుకోవాలి. పశు పోషణ రైతులకు భారంగా మారింది. పెరుగుతున్న దాణా ధరలతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ధరలను నియంత్రించాలి. తప్పని పరిస్థితుల్లో కొనసాగిస్తున్నాం. పాడి రంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి.

– రవి కుమార్, పాడిరైతు మోత్కూర్

బడి ఎందుకు మానేశారు?

- స్కూల్ మానేసిన విద్యార్థుల కోసం ఇంటింటి సర్వే
- పిల్లల భవిష్యత్ గురించి వివరించిన సీఆర్పీలు



ధారూరు: స్టేషన్‌ధారూరులో సర్వే నిర్వహిస్తున్న సీఆర్పీలు

బొంరాస్‌పేట: బడి ఎందుకు మానేశారంటూ సీఆర్పీలు బడిమానిన విద్యార్థుల కోసం ఇంటింటి సర్వే చేపట్టారు. 6నుంచి 14 ఏళ్ల వయసున్న బాల బాలికల కోసం మండల సీఆర్‌పీలు నాలుగు రోజులుగా సర్వే చేస్తున్నారు. బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లోని సీఆర్‌పీలు బావుసింగ్, రాందాస్, నర్సింహులు, శంకరయ్య, శివవర్ధన్, సోమ్లా బడిబయటి పిల్లలపై ఆరతీస్తూ ఇంటింటి సర్వే చేస్తున్నారు. కాగా మంగళవారం ఇరు మండలాల పరిధిలోని మేడిచెట్టు తండాతో పాటు పలు తండాల్లో బాడిమానిన విద్యార్థులను గుర్తించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి బడిలో చేర్పించారు.

బడిలో చేర్పించాలి

ధారూరు: బడి మానేసిన పిల్లలను బడిలో చేర్పించాలని సీఆర్పీలు తల్లిదండ్రులను కోరారు. స్టేషన్ ధారూరు గ్రామంలో బడి బయట ఉన్న పిల్లల(ఓఎస్‌సీ) సర్వే నిర్వహించారు. 6 నుంచి 14 సంవత్సరాలున్న వారిని గుర్తిస్తున్నామని ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్ తెలిపారు. బడి వీడిన పిల్లల వలన కలిగే నష్టాలను, బడిలో చేర్పిస్తే వచ్చే లాభాలను వివరించారు. అనంతరం బడి బయట, బడి మానేసిన పిల్లల వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ ఓఎస్‌సీ సర్వేలో సీఆర్‌పీ రాజశేఖర్, ఐఆర్‌ఆర్‌టీ మోహన్, ఏడబ్ల్యూసీ సరస్వతి, గ్రామ కార్యదర్శి రేఖలు పాల్గొన్నారు.

చదువుకుంటే భవిష్యత్తు

కుల్కచర్ల: చిన్నారులు చదువుకుంటే ఉత్తమ భవిష్యత్ పొందగలుగుతారని ముజాహిద్‌పూర్ సీఆర్పీ రాజునాయక్ అన్నారు. దాస్యనాయక్ తండాలో డ్రాపౌట్స్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుపేదలు వలస పోతూ.. పిల్లలను తీసుకెళ్లడం వలన విద్యార్థులు వారి చదువును మధ్యలోనే ఆపేయాల్సిన పరిస్థితి నెలకొందని చెప్పారు. ప్రస్తుతం బడిమానేసిన పిల్లలను తిరిగి బడిలో చేర్పేందుకు అవకాశం ఉందని, తల్లిదండ్రులు వారి పిల్లలను పాఠశాలలో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీ రమేష్, విజయ్, మైపాల్ తదితరులు సర్వే నిర్వహించారు.

సర్వసభ్య సమావేశం నేడు

మర్పల్లి: మర్పల్లిలో బుధవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపీపీ బట్టు లలిత ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ రానున్నారని ఆమె తెలిపారు. సమీక్షకు జెడ్పీటీసీ మధుకర్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మండలస్థాయి అధికారులు పూర్తి సమాచారంతో రావాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి
- ఖాజాఅహ్మద్‌పల్లి బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ



ఖాజాఅహ్మద్‌పల్లి వంతెన నిర్మాణ పనులకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే

కొడంగల్ రూరల్: అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లకు ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి చెప్పారు. మంగళవారం పట్టణంలోని వివిధ కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలిస్తూ సూచనలు ఇచ్చారు. 9వ వార్డులోని సీసీరోడ్డు పనులు, మురుగు కాల్వల నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. కాలనీల్లో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని, సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని చెప్పారు. నూతనంగా నిర్మిస్తున్న మున్సిపల్ భవన నిర్మాణ పనులను పరిశీలించి, నిర్మాణ సామగ్రి నాణ్యత ఉండేలా చర్యలు తీసుకోవాలని నిర్మాణదారునికి చెప్పారు. అనంతరం మండల పరిధిలోని ఖాజాఅహ్మద్‌పల్లి బ్రిడ్జి నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్, పలువురు సర్పంచులు సయ్యద్ అంజద్, గోవిందు, శంకర్‌నాయక్, పకీరప్ప, వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచు రమేష్‌బాబు, అధికారులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం తగదు

- ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- సర్వసభ్య సమావేశంలో జెడ్పీటీసీ



సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

దోమ: గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీపీ అనసూయ, జెడ్పీటీసీ నాగిరెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పోతిరెడ్డిపల్లి గ్రామానికి మిషన్ భగీరథ నీరు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీపీ అనసూయ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయగా.. గ్రామాల్లో నెలకొన్న సమస్యను ఆయా శాఖల అధికారులు పరిష్కరించేలా చూడాలని జెడ్పీటీసీ చెప్పారు. దోమ నుంచి పాలేపల్లి, పాలేపల్లి నుంచి మల్లేపల్లి వరకు రూ.కోటి 57 లక్షలతో బీటీరోడ్డు మంజూరైందని, త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

కొందరే అధికారులు వస్తున్నారు..

ప్రతి సర్వసభ్య సమావేశంలో కొన్ని శాఖల అధికారులే సభకు వస్తున్నారని, మిగతా అధికారులు ఎందుకు రావడం లేదని వైస్ ఎంపీపీ మల్లేశం ప్రశ్నించారు. ఇదిలా ఉండగా.. కేంద్ర కమీషన్ గ్రాంట్స్ రాక ఇబ్బందులు పడుతున్నామని, జీపీ సిబ్బంది జీతాలు సైతం అప్పుచేసి చెల్లించాల్సి వస్తుందని పలువురు సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా స్థాయిలో ఉన్న అంగన్వాడీ పోస్టులను అధికారులు భర్తీ చేస్తే.. దోమ మండలంలోని బొంపల్లి, పరిగి మండలంలోని సుల్తాన్‌పూర్‌లో ఎందుకు భర్తీ చేయలేదని ఆ శాఖ అధికారిపై బొంపల్లి సర్పంచ్ సురేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అంగన్వాడీ పోస్టును భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

బిల్లుల చెల్లింపులో ఏఈ నిర్లక్ష్యం!

పాఠశాలలను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం మనఊరు–మనబడి కార్యక్రమాన్ని తీసుకువస్తే, అధికారుల నిర్లక్ష్యానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. బ్రహ్మణపల్లి సర్పంచ్ జగని వెంకటయ్య పాఠశాలలో మనఊరు–మనబడి పనులు చేపట్టారు. అయితే వాటి బిల్లులు చెల్లించడంలో ఏఈ సిద్దార్థ్ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కమీషన్ వచ్చే బిల్లులను చేస్తూ.. ఎన్‌ఆర్ ఈజీఎస్ కింద చేపడుతున్న పనుల బిల్లులు చేయడం లేదని విమర్శించారు. వెంటనే ఆయన్ను విధుల నుంచి తప్పించాలని కోరారు. ఈ విషయంపై స్పందించిన వైస్ ఎంపీపీ మల్లేశం, ఎంపీడీఓ జయరాం ఏఈ పనితీరుపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. పీఏసీఎస్ చైర్మన్ దాతన్నగారి ప్రభాకర్ రెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి, ఎంపీడీఓ జయరాం, డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను విజయవంతం చేద్దాం



వికారాబాద్ అర్బన్: అవగాహన సదస్సులో మాట్లాడుతున్న చైర్‌పర్సన్



కుల్కచర్ల: మాట్లాడుతున్న మండల వైద్యాధికారి

- 18 ఏళ్లు నిండిన వారందరూ కంటి పరీక్ష చేయించుకోవాలి
- మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, కుల్కచర్ల వైద్యాధికారి మాధురి

వికారాబాద్ అర్బన్: ఈ నెల 18నుంచి ప్రారంభం కానున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల అన్నారు. బుధవారం మున్సిపల్ సిబ్బంది, వైద్య సిబ్బందికి మున్సిపల్ హాల్‌లో కంటి వెలుగుపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, మెడికల్ ఆఫీసర్లు, ఆర్పీలు, స్పెషల్ ఆఫీసర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లతో కూడిన 8మంది టీమ్ పకడ్బందీగా పనిచేయాలని, స్థానిక కౌన్సిలర్ల సలహాలు సూచనలు తీసుకొని నిర్వహించాలని సూచించారు. 18 ఏళ్లు పై బడిన వారందరూ కంటి పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అవగాహనలో మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర, డిప్యూటీ డీఎంహెచ్ఓ జీవరాజ్, మెడికల్ ఆఫీసర్ మానిక తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి జూన్ 30 వరకు

కుల్కచర్ల: రెండో విడత కంటివెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కుల్కచర్ల వైద్యాధికారి మాధురి అన్నారు. ఈ మేరకు ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండి ప్రతి ఒక్కరూ తమ కంటి చూపును పరీక్షించుకునేందుకు అర్హులని, కార్యక్రమం 18 నుంచి జూన్ 30 వరకు కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ గిరి, సీహెచ్ఓ చంద్రప్రకాష్, వైద్య సిబ్బంది విజయలక్ష్మి, వెంకట్, అంజు, యాదమ్మ, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు సమావేశం

నవాబుపేట: ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ కాలె భవాని అధ్యక్షతన కంటి వెలుగుపై మండల స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ సుమిత్రమ్మ తెలిపారు. కార్యక్రమానికి వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తప్పని సరిగా హాజరు కావాలన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాలె యాదయ్య పాల్గొంటారని తెలిపారు.

కంటి వెలుగు షెడ్యూల్

బంట్వారం: రెండో విడత కంటి వెలుగు శిబిరాల షెడ్యూల్ గ్రామాల వారీగా విడుదలైంది. ఇందుకు సంబంధించిన వివరాలను బంట్వారం, కోట్‌పల్లి పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు రాకేశ్, గోపాల్ మంగళవారం వేర్వేరుగా ప్రకటించారు. వివరాలు ఇలా ఉన్నాయి. బంట్వారం మండలంలోని మద్వాపూర్‌లో ఈ నెల 18 నుంచి 19 వరకు రెండు రోజుల పాటు నిర్వహించగా.. నాగవరం 20 నుంచి 24, బస్వాపూర్ 25 నుంచి ఫిబ్రవరి 1వ వరకు ఉంటుంది. సల్బత్తాపూర్ 2 నుంచి 10, బొప్పునారం 13 నుంచి 22 వరకు, రొంపల్లి 23 నుంచి మార్చి 6వ వరకు కొనసాగుతుంది. మండల కేంద్రంలో మార్చి 8 నుంచి 28 వరకు, తొర్మామిడి 29 నుంచి ఏప్రిల్ 26 వరకు జరుగనుంది. సుల్తాన్‌పూర్ జూన్ 2 నుంచి 6 వరకు, యాచారం 7 నుంచి 9 వరకు, మాలసోమారం 12 నుంచి జూన్ 15తో ముగుస్తుంది.

కోట్‌పల్లి మండలంలో..

కోట్‌పల్లి ఈ నెల 18 నుంచి ఫిబ్రవరి 6 వరకు, అన్నాసాగర్ 7 నుంచి 10 వరకు, ఇందోల్ 13 నుంచి 16 వరకు, ఓగులాపూర్ 17 నుంచి 21 వరకు, బుగ్గాపూర్ 22 నుంచి 24 వరకు, కొత్తపల్లి 27 నుంచి మార్చి 3 వరకు, లింగంపల్లి మార్చి 6 నుంచి 8 వరకు ఉంటుంది. రాంపూర్ 9 నుంచి 16 వరకు, కంకణాలపల్లి 17 నుంచి 23 వరకు, జిన్నారం 24 నుంచి 31 వరకు కొనసాగనుంది. ఎన్కెపల్లి ఏప్రిల్ 3 నుంచి 6 వరకు, ఎన్నారం 10 నుంచి 20 వరకు, బార్వాద్ 21 నుంచి మే 3 వరకు కాగా.. మరికొన్ని ప్రాంతాల్లో జూన్ 1 వరకు జరగనుంది.

ప్రజాపంపిణీ వ్యవస్థ నిర్వీర్యం



పరిగి: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు



యాలాలలో..

- పీడీఎస్ బియ్యం సరఫరాలో కోతపై ప్రతిపక్షాలు, ప్రజా సంఘాల ఆగ్రహం
- ఆరు కిలోలు ఇవ్వాలని డిమాండ్

పరిగి: రేషన్ బియ్యాన్ని కేంద్ర ప్రభుత్వం తగ్గించడం సిగ్గు చేటని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంటయ్య అన్నారు. ఈ మేరకు ప్రతి లబ్ధిదారునికి 10కిలోల బియ్యం ఇవ్వాలని మంగళవారం తహసీల్దార్ రాంబాబుకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు 14 రకాల నిత్యావసరా సరుకులను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. 6కిలోల బియ్యం నుంచి 5కిలోలకు తగ్గించడంతో నిరుపేదలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు హబీబ్, సత్తయ్య, శేఖర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

యాలాల: ప్రజాపంపిణీ వ్యవస్థలో కిలో బియ్యాన్ని తగ్గిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ గోవిందమ్మకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రేషన్ వ్యవస్థను పటిష్టపరచకుండా ఈ ప్రభుత్వాలు నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తున్నాయని విమర్శించారు. 2015 నుంచి ప్రతి లబ్ధిదారుడికి ఆరు కిలోల బియ్యం ఇస్తుండగా.. తాజాగా కిలో బియ్యం తగ్గించాలనే నిర్ణయం సరైంది కాదన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రమేష్, రాజు, రవికుమార్, మహేష్ తదితరులు ఉన్నారు.

ఆరు కిలోల బియ్యం ఇవ్వాలి

దోమ: రేషన్ లబ్ధిదారులకు ఆరు కిలోల బియ్యం ఇవ్వాలని సీపీఎం మండల అధ్యక్షుడు సత్తయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ షాహెదా బేగంకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పేదలకు ఇచ్చే బియ్యంలో ప్రభుత్వాలు కోత విధించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తూ.. పేదల కడుపుకొట్టే విధానాన్ని ప్రభుత్వాలు ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సత్తయ్య, చెన్నారెడ్డి, శేఖర్, శ్రీను, చరణ్, బాలయ్య, రాంచంద్రయ్య పాల్గొన్నారు.

పండుగల విశిష్టతను తెలియజేయాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న
- అటవీశాఖ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

తాండూరు రూరల్: పండుగల చరిత్రలను ముందు తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్ అన్నారు. మంగళవారం అంతారం శివారులోని అర్బన్‌పార్కు వద్ద సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. నేటి యువత పండుగలను మర్చిపోయిందని, ముగ్గులు, బొడ్డెమ్మలు అంటే కూడా పట్టణ వాసులకు తెలియదని వాపోయారు. భవిష్యత్ తరాలు మర్చిపోకుండా ఉండాలంటే పండుగల విశిష్టతను నేటి యువతకు చెప్పేందుకు ఇటువంటి పోటీలు నిర్వహించాలన్నారు. కందనెల్లితండాలోని గిరిజన బాలికలు ముగ్గుల పోటీల్లో పాల్గొనడంపై ఆమె సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ దీప, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్యాంసుందర్‌రావు, డిప్యూటీ ఆఫీసర్ నాగజ్యోతి, జెడ్పీటీసీ మంజుల, ఎంపీపీ అనురాధ, వైస్‌ఎంపీపీ మధులత, సర్పంచులు రాములు, పద్మమ్మ, ఎంపీటీసీలు శాంతు, నీలిమ, కౌన్సిలర్ రవి, నాయకులు గౌడి వెంకటేశం, శేఖర్, ఇర్షాద్, వేడిడ్, నర్సింహులు పాల్గొన్నారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న చైర్‌పర్సన్

'పల్లెపల్లెకూ' అనూహ్య స్పందన

కాంగ్రెస్ పార్టీ బ్లాక్–2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి



పార్టీ కార్యకర్తలతో కృష్ణారెడ్డి

మర్పల్లి: గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకి మంచి స్పందన లభించిందని పార్టీ బ్లాక్–2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి అన్నారు. పల్లెపల్లెకూ కార్యక్రమంలో భాగంగా రెండోరోజైన మంగళవారం పట్లూర్, ఘణాపూర్, జంషాద్‌పూర్ గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణారెడ్డి మాట్లాడారు. పల్లెపల్లెకూ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి, సమస్యలను తమ దృష్టికి తీసుకు వస్తున్నారని ఆయన చెప్పారు. ఘణాపూర్‌లో 265 ఎకరాల సర్కారు భూమిని నాటి మంత్రి ప్రసాద్‌కుమార్ చిన్నతరహా పరిశ్రమల కోసం సర్వేచేసి ప్రభుత్వానికి నివేదిక పంపితే.. బీఆర్ఎస్ ప్రభుత్వం పరిశ్రమలు ఏర్పాటు చేయకుండా.. మైనింగ్‌కు ఇవ్వడం సరైంది కాదని హితవుపలికారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే.. ఆ భూమిని భూమిలేని నిరుపేదలకు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశాడు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఖలీమోద్దీన్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహులు, కార్యదర్శి సంజీవరెడ్డి, బీసీసెల్ జిల్లా ఉపాధ్యాక్షుడు నగేశ్, కార్యదర్శి సంజీవరెడ్డి, మండల వర్కింగ్ ప్రసిడెంట్లు సురేష్, రఫీయొద్దీన్, లక్ష్మారెడ్డి, మధుకర్‌రెడ్డి, ప్రభాకర్, అశోక్‌రెడ్డి, సోషల్‌మీడియా మండల కో–ఆర్డినేటర్ పాండు పాల్గొన్నారు.